# నిర్ణయం

## ఊర్మిళాజ్యోతి

"ఆకులో ఆకునై ... పూవులో పూవునై ..." కృష్ణశాస్త్రి గీతం స్ఫురణకు తెచ్చేలా కదిలే ఆకుల నడుమ కదలిక లేని శిలలా ... చూపుల కందని శూన్యంలో కరిగిన ఏ కలల జాడనో వెతుక్కుంటూ ఎప్పటిలాగే కూర్చుని ఉంది ఛాయ. చేతిలో ఏదో పుస్తకం, చూపులు మాత్రం ఆకాశంలో!

"మేడమ్! మీ కోసం ఎవరో వచ్చారు!" మెత్తగా వినిపించిన స్వరానికి ఉలిక్కి పడిందంటే ఎంత ఆలోచనలో ఉందో ఇట్టే తెలుసుకోవచ్చు.

"ఊఁ ఆఁ?" పరధ్యానంగా అడిగింది. మరోసారి చెప్పి కదిలిపోయింది ఆ అమ్మాయి.

తేరుకుని చుట్టూ చూసింది. అక్కడక్కడా చెట్లకింద అల్లరికి ఆనకట్టవేసి బుద్ధిగా చదువుకుంటున్నారు విద్యార్థులు. స్టాఫ్ రూంలో ఎన్నో జతల అనుమానపు చూపులతో, కుతూహలంతో ఆక్యువంక్చర్ చేయడం భరించలేక పరోక్షంగా తన గురించి ఏ రకంగానైనా మాట్లాడుకునే అవకాశం వాళ్ళ కిస్తూ త నిలా గార్డెన్‌లో కూర్చోవడం అలవాటు చేసుకుంది ఛాయ.

తనకోసం వచ్చే వ్యక్తి అన్నయ్య తప్ప ఇం కెవరు? కానీ ఈ టైంలో? వదినకుగానీ ఏమైనా ... కంగారుగా అనిపించింది ఓ క్షణం.

రెండ్రోజులుగా వదిన జ్వరంతో ఉంది. ఆలోచిస్తూనే కదిలి వచ్చింది మెల్లిగా హుందాగా, అడుగులు వేస్తూ. వెయిటింగ్ హాల్ ఎదుట ఆగిపోయింది.

కారణం - ఆలస్యాన్ని భరించలేని అసహనంతో అటూ, ఇటూ పచార్లు చేస్తున్న వ్యక్తి తన అన్నయ్య కాదు. 'అత నెవరో వెంటనే గుర్తు రాలేదు. ఇంతకీ తనకోసమేనా వచ్చిందీ?' అనుమానం వచ్చింది.

అప్పుడే ఇటు తిరిగిన వ్యక్తి ఆగిపోయాడు.

"ఛాయా!" ఆత్రతగా దగ్గరకి వచ్చారు.

అతను ... అతను ... అయోమయంగా చూస్తుండిపోయింది ఛాయ.

"నేను ఛాయా! చంద్రకాంత్‌ని. మరిచిపోయావా?" చివరి పదం పలుకుతుంటే చిన్నబోయిన స్వరంలో కొద్దిగా బాధ ధ్వనించింది.

"చంద్రకాంత్!" తుళ్ళిపడింది ఛాయ. ఆకాశం విరిగిపడేలా కేక వేస్తుందనీ, భూమి అదిరిపోయేలా పరుగులెత్తి తనను అల్లుకుంటుందనీ కల్లోలమైన కడలిలో ఎగిసిపడే తరంగాల్లా కన్నీరు కారుస్తుందనీ - తన మనసుకు తృప్తి కలిగించే విధంగా ఎన్నో ఊహించుకుంటున్న చంద్రకాంత్ మరోసారి చిన్నబోయాడు. తుళ్ళిపడిన ఛాయ కళ్ళలో ఒకింత ఆశ్చర్యం మాత్రమే అతనికి కనిపించింది. కానీ కన్నీరు మెరిసి కళ్ళలోనే ఇంకిపోయిందని అతనికి తెలీదు. ఎంతకీ ఛాయ మాట్లాడకపోవడంతో తప్పని సరై గళం విప్పాడు.

"ఛాయా! నేను ..."

"ఇప్పుడే వస్తాను" అంటూ వెనుదిరిగింది.

దాదాపు పన్నెండేళ్ళ తర్వాత ఛాయ మాట్లాడిన మొదటి మాట. బాధ, కోపం, అవమానం అవసరం మాటున దాగిపోవడంతో మౌనంగా ఉండిపోయాడు చంద్రకాంత్.

పది నిమిషాల తర్వాత వచ్చింది ఛాయ సొగసు కిరీటం పెట్టినట్లు తెల్లబడిన వెంట్రుకలు, జీవితంలో ప్రయాణించిన అలసటను సూచిస్తున్న ప్రతి అవయవమూ. కళ్ళలో ఆనాటి చైతన్యం, చిలిపితనం లేవు. వాటిస్థానే గాంభీర్యపు ముసుగు వేసిన అహంకారం. ఇది అతని రూపమైతే, గుండెలోంచి ఎగదన్నుకు వచ్చే దుఃఖాన్ని అదిమిపెట్టే ఆత్మాభిమానం, కన్నీరు కురిపించి మనసు వేడి కరిగించాలని ప్రయత్నించే కళ్ళూ ఛాయ మనో చిత్రం. నిగ్రహించుకుని "పదండి" అంది ముభావంగా.

మౌనంగానే అనుసరించాడు చేతిలోని బాగ్‌తో. ఆటో డ్రైవర్‌తో అడ్రస్ చెప్పడం విని - "ఛాయా! ఇంకా ఎంత ప్రేమ నేనంటే" అన్నాడు ఆప్యాయంగా.

నవ్వింది ఛాయ. అది మామూలు నవ్వేలా లేదు. అతి సున్నితంగా హృదయాన్ని కోసేలా వ్యంగ్యంగా ఉంది.

ఇంకా అట ఇంకా! మనసులోని ఓ మనిషిని ఇంకా ప్రేమించేందుకు త నేం మనిషి కాదూ? మనసూ, అభిమానం లేవూ? రెండేళ్ళపాటు ప్రేమించిన పాపానికే పన్నెండేళ్ళుగా బాధపడుతోంది. అలాంటిది ...'

ఆటో ముందుకు సాగుతుంటే ఆలోచనలు ఒక్క గెంతున వెనక్కి వెళ్ళిపోయాయి.

** ** **

"ఛాయా! ఛాయా!" గావు కేకలు వేస్తూ వచ్చాడు శ్రీకాంత్.

"ఆఁ! వస్తున్నా! వదిన అక్కడే ఉంది చూడు" పెరట్లోంచే తిరిగి కేక పెట్టింది ఛాయ.

అవునూ! వస్తూనే నీరూ! అంటూ వదిన్ని పిలిచే అన్నయ్య తనను పిలుస్తున్నా డేమిటి? ఏమిటబ్బా విశేషం?' ఆలోచన రావడంతోనే చెంగున లేచింది అక్కడి నుంచి.


"నీరూ! ఇతనే చంద్రకాంత్. నేను చెప్పానే! మన ఛాయ కోసం ... ఇదిగో, అందుకే వచ్చాడని తనతో చెప్పకు. చంపుకు తింటుంది. మరేం లేదోయ్! పెళ్ళి చూపులంటే తన కసలిష్టం ఉండదు. అందుకే అన్న మాట."

త నిప్పట్లో రా దనేమో అసలు విషయం చెప్పేశాడు అన్నయ్య.

"అరే! వచ్చేసిందిగా ఛాయ!"

ఒక్క క్షణం సిగ్గుపడిపోయింది ఛాయ.

కంగారును కప్పేసుకుని నవ్వు పులుముకుంటూ "రా! రా! అక్కడే ఆగిపోయావేం? ఇతను నా ఫ్రెండ్ చంద్రకాంత్. వచ్చి నెలైందేమో! అంతే! పాపం బోర్





కొడుతోందట. నీ దగ్గ రేమైనా బుక్స్. దొరుకుతా యనీ ..'' ఇంకా ఏమో చెప్పబోయాడు గానీ మరీ ఓవర్ యాక్షన్ అయిపోతుందని ఆపేశాడు.

మామూలుగా ఫ్రెండ్ అంటే విష్ చేసి మాటలు కలిపేది. కాని ఇప్పుడు పెళ్ళి చూపులు అని తెలియకుండా ఏర్పాటైన పెళ్ళి చూపులని తెలిసిన తర్వాత ఫ్రీగా మాట్లాడలేకపోయింది. 'అతనైనా పలకరించవచ్చుగా' అనుకుంటూ తలెత్తి చూసింది. తన వంకే పరీక్షగా చూస్తున్నా డతను. చూడగానే అయస్కాంతంలా ఆకర్షిస్తాయి అతని కళ్ళు. అంతే! త నో ఇనుపముక్క అయిపోయింది.

ఆ తర్వాత రెండు నెలలకే పెళ్ళయింది. అటు తర్వాత సంవత్సరంన్నరలో ఒక్కో దురలవాటు బయటపడి, ఆఖరికి పెళ్ళయిన రెండవ సంవత్సరానికే ...

''మేడమ్! వచ్చేశాం!''

''ఛాయా! ఏమిటీ ఆలోచిస్తున్నావ్?'' అంటున్న అతని స్వరం వినబడి ఈ లోకంలోకి వచ్చింది. తడిసిన కనురెప్పలను చీరకొంగుతో అద్దా లనుకుంది. కానీ ఊహుఁ తన బాధపడుతున్నట్లు ఇతనికి తెలియనీయకూడదు అన్నట్లు అతి మామూలుగా దిగి, మీటరు చూసి డబ్బు లిచ్చేసింది చంద్రకాంత్ పర్స్ తీస్తుండగానే.

ఇంటివైపు నడక సాగించింది. ఈ సారి 'పదండి' అనే అవకాశం ఇవ్వకుండానే ఫాలో అయ్యాడు చంద్రకాంత్. ఇద్దరిలోనూ స్పందన. ఇద్దరిలోనూ ఆవేదన. అతనిలో పశ్చాత్తాపం - ఇన్నాళ్ళూ ఒంటరిగా, ఎంత నిర్దయగా వదిలివేశాడు తను! ఒక్క రోజైనా తన గురించి ఆలోచించాడా? పన్నెండేళ్ళలో - సరిగ్గా నెల రోజుల క్రితమే తనకు ఛాయను గురించి ఆలోచించే 'తీరిక' దొరికింది.

తలుపు తాళం తీసింది ఛాయ. ఇంట్లోకి అడుగు పెట్టా రిద్దరూ.

అతని చేతిలోని బాగ్ అందుకుని పక్క గదిలోకి నడిచింది ఛాయ. అది తన రూం అన్న మాట. ఛాయను పరీక్షగా చూశా డతను. కరిగిపోయిన కలలు తట్టుకోలేక కన్నీరు కార్చి కళ తప్పిన కళ్ళు. దిగులు నంతా కప్పేసిన హుందాతనం. ఎద లోయలోని ఏ ఆలోచనా పైకి వ్యక్తం చేయని వ్యక్తిత్వం. అయినా అతని కళ్ళకు దిగులుతో కృశించిపోయినట్లు కనిపించింది.

''ఛాయా! గలగలా మాట్లాడేదానివి. నిముషానికి ఎక్కువ మాటలు మాట్లాడి గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించుకుంటావ్ అని నేనూ, శ్రీకాంత్ వెక్కిరించేవాళ్ళం. ఇప్పుడు నీ స్వరమే వినిపించ దేం?'' ఆర్తిగా అడిగాడు చంద్రకాంత్.

చురుగ్గా చూసింది అతని వంక. ఆ కళ్ళలో అంతర్లీనంగా ఏహ్యం. వెంటనే చూపులు తిప్పేసుకుని.

''స్నానం చేస్తారా?'' అ నడిగింది. ఆ అడగడంలో ఇష్టంగా తీసుకునే బాధ్యత లేదు. తప్పనిసరై చేస్తున్న ఫీలింగే.

''ఊఁ!'' బాధగా ఉం దతనికి. ఈ పరిస్థితికి కారణం కచ్చితంగా తనే. అయినా శిక్ష భరించేందుకు సిద్ధంగా లేడు అతను.

మౌనంగానే నీళ్ళు తోడింది. స్నానం చేసి వచ్చేసరికి వంట సిద్ధం చేసింది. అన్నీ తన కిష్టమైన పదార్థాలే!

''ఛాయా!'' చంద్రకాంత్ కళ్ళలో సంతోషం.

నిర్లిప్తంగా చూసింది ఛాయ. ఆమె చేతి వంటను ఆప్యాయంగా తిన్నాడు.

''నీవూ తిను.'' ఆ మాట వినిపించుకోలేదు ఛాయ. ఇంకోసారి చెప్పాడు. వినకపోవడంతో ఇం కేం చేయలేకపోయాడు. బలవంతంగా తినిపించే అర్హత తనకు లేదు.

వంటిల్లు సర్ది డ్రాయింగ్ రూంలో కూర్చున్న చంద్రకాంత్ దగ్గరికి వచ్చింది ఛాయ. ఆ ముఖంలో ఏ భావమూ చదవలేకపోతున్నాడు చంద్రకాంత్.

''చెప్పండి!'' అడిగింది అతనికి ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ.

'ఇన్నేళ్ళూ లేనిది ఇంత హఠాత్తుగా రావడం ఏమిటి? తన మీద జాలితోనా? ఎలా బ్రతుకుతోందో చూసిపోదామనా లేక తనకున్న ఈ మనశ్శాంతిని కూడా దూరం చేయాలనా?', పైకి రాలే దా మాటలు.

ఓసారి ఛాయ ముఖంలోకి చూసి మొదలుపెట్టాడు చంద్రకాంత్. ''ఛాయా! క్షమించమని అడిగే అర్హత కూడా నాకు లే దిప్పుడు. నీకు చేసిన ద్రోహానికి ఈ ఇంటి గడప తొక్కే అర్హత లేదు. కానీ చల్లని మనసున్న దేవతని. ని న్నేమని పొగడాలో అర్థం కావడం లేదు. ఛాయా! వెన్నెలాంటి మనసున్న నిన్ను దూరం చేసుకున్న పాపాత్ముడిని. అందుకే దేవుడు నాకు తగిన శిక్ష విధించాడు.

ఛాయా! స్నేహితుడు అనే పదానికే ద్రోహం చేసిన వాడిని నేను. అత్యంత ఆప్యాయంగా చూసుకునే శ్రీకాంత్‌నీ, ఆణిముత్యం లాటి నిన్నూ కా దనుకుని ...''

ఛాయ ముఖంలో అసహనం ఆ మాటలు వినేందుకు ఇష్టపడటం లేదని గ్రహించి కాస్సేపు మౌనంగా ఉండిపోయాడు.

''ఛాయా! చెప్పానుగా - దేవతలాంటి నీ

కన్యాయం చేసినందుకు దేవుడు నాకు భయంకరమైన శిక్ష విధించాడు. ఇంతకాలం నాకు ఇష్టం వచ్చిన రీతిలో గడిపాను. ఈ అవసాన దశలో ... డాక్టర్ చెప్పారు .. నేను ఆరునెలల కంటే ఎక్కువ బ్రతకనని. ఈ ఆరు నెలలైనా నీ చెంత గడిపి ..."

ఛాయ ముఖంలో ఆశ్చర్యం. ఇది నిజమా! ఒకప్పుడు తను ప్రాణానికన్నా మిన్నగా ప్రేమించిన చంద్రకాంత్‌కు ... హుఁ! అసలు త నింకా ఎక్కువ కాలం బ్రతకడని తెలిసే వచ్చాడు. లేకపోతే వచ్చేవాడే కాదు. ఛాయ కళ్ళలోని కన్నీటి పొరలను మరోలా అర్థం చేసుకున్నాడు చంద్రకాంత్.

"ఛాయా! ఆనాడు డబ్బుం దన్న అహంకారంతో నిన్నూ నీ ప్రేమనూ కాదని వెళ్ళిపోయాను. శ్రీకాంత్ బెదిరించేవాడు. బ్రతిమాలేవాడు. ఊహుఁ! ఏనేంత సంస్కారం లేకపోయింది. ప్రేమ, అభిమానం నా కప్పుడు శబ్దే! అవి పుష్కలంగా ఉన్న రమ్యే లోకం అయింది."

రమ్య టాపిక్ రావడంతో చివ్వున లేచింది ఛాయ. "సరే! రెస్ట్ తీసుకోండి" త నాశించే ఏ ఒక్క భావమైనా లేదు ఛాయ ముఖంలో. తనను ఆదరించినట్లేనా?

"ఛాయా! నన్ను క్షమించవూ?"

"క్షమిస్తాను. పన్నెండేళ్ళ కాలాన్ని వెనక్కి తేగలరా?" అడిగింది మెత్తగా నవ్వుతూనే.

"ఛాయా!" నివ్వెరపోయాడు.

"హు!" నిట్టూర్చింది ఛాయ. "పదండి ..."

స్థాణువులా నిలబడిన అతనిలో చైతన్యం వచ్చింది. అప్పుడే నడక నేర్చినవాడిలా అడుగులో అడుగువేస్తూ తన కంటూ ఏర్పాటు చేసిన గదిలోకి వెళ్ళాడు.

"గుడ్ నైట్!" తలుపులు చేరవేసి వెనుదిరిగింది ఛాయ అత నలా నిస్తేజంగా చూస్తూండగానే.

అంతదాకా ఉగ్గబట్టుకున్న దుఃఖం పెల్లుబికింది. వెక్కి వెక్కి ఏడ్చింది ఛాయ. చాలాసేపటికి తేరుకుని, ఓ నిశ్చయానికి వచ్చిన దానిలా కళ్ళు తుడుచుకుని పేపర్, పెన్ అందుకుంది. మరుక్షణం దీక్షగా రాయడం మొదలుపెట్టింది.

** ** **

కళ్ళు తెరవగానే "బెడ్ కాఫీ ఏమిటి అనవ్యాంగా" అంటూ బ్రష్ పట్టుకుని, తనని మేల్కొలుపుతుంది అనుకుంటూ ఊహాలోకంలోని పోబోయిన చంద్రకాంత్‌కి. ఎవరో ఛెళ్ళున చరిచినట్లయింది తన పక్కన ఉన్న రెపరెప లాడుతున్న పేపర్ చూసి. అ దో అపశకునంలా తోచిం దతనికి. ఇదీ అని చెప్పలేని భావం. వణికే చేతులతో అందుకుని తెరిచాడు.

"చంద్రకాంత్!

"గంటలూ ... రోజులూ ... వారాలూ ... కాదు. కనీసం నెలలు కూడా కాదు. సంవత్సరాలు ... ఏకంగా పన్నెండు సంవత్సరాలు నా జీవితంలోని ఆనందాన్నీ మనిషి జీవితంలో ఎంతో ప్రాధాన్యం ఉన్న యౌవన కాలాన్ని నిస్తేజపరిచి, కుళ్ళు సమాజంలో నా గురించి అడ్డమైనవారికీ వాగే




అధికారా న్నిచ్చి ,ని దారి నీవు చూసుకుని ... ఇప్పుడు నీ అవసాన కాలంలో 'ఆదరించక చస్తుందా?' అనే నమ్మకంతో వచ్చిన నీకు నా జోహార్లు.

"పన్నెండేళ్ళ క్రితం ... ఇలాగే ఉత్తరం ముక్క అతి సింపుల్‌గా 'నీతో నేను కోరుకున్న సంతోషాన్ని పొందలేకపోతున్నాను. అందుకే వెళ్ళిపోతున్నా' నంటూ రాసి వెళ్ళిపోయావు. ఆనాడే నీవు నా దృష్టిలో. చచ్చిపోయావు. ఇంత ఘాటుగా చెప్తున్నందుకు బహుశా నీ క్రోధం వస్తుండవచ్చు. మండే నా గుండె ఇంతకంటే నెమ్మదిగా మాట్లాడలేకపోతోంది. అయినా నిజానికి ఇంత ఓపిగ్గా రాస్తున్నందుకు నన్ను అభినందించాలి కదూ?

"నాకు తెలును. సతీ సుమతి, సతీ సావిత్రుల సంగ తలా ఉంచి. భర్త చితిపైన సజీవంగా ప్రాణా లర్పించిన 'రూప్ కఁవరు' పుట్టిన దేశంలో పుట్టిన నే నిలా మాట్లాడటం నీ క్రోధాన్నీ ఆశ్చర్యాన్నీ కలిగిస్తుందని! స్త్రీలలో అనేకులు వీరి భావాలతో ఏకీభవించరు నీకు తెలిసో, లేదో!

"అసలు విషయానికి వస్తాను. ఎప్పుడో జీవితం అంటే ఇదీ అని పూర్తిగా తెలుసుకోకముందే నీ అత్యాశకు నన్ను బలి చేశావు. విడాకులు తీసుకోకుండానే ఇంకో పెళ్ళి చేసుకున్న నిన్ను కోర్టు కీడుస్తా నని అన్నయ్య అంటే నేనే వద్దన్నాను. ని మీద ప్రేమతో కాను, ఆ క్షణంలోనే నీవు వేసిన బంధాన్ని తొలగించాను. ఇక నుంచి నీవు నా కేం కావు' అని, ఎలా పోయినా నా కవసరం లేదని. అలా పోయి, ఇప్పుడు అనుభవించే వయసు పోయాక, ఆదుకునే వా రెవేరూ లేక నా దగ్గరికి వచ్చావు తప్ప, ప్రేమతో కాదు. ఇన్నేళ్ళూ లేని ప్రేమ హఠాత్తుగా పుట్టిం దంటే ఎలా నమ్మను?

"తోడు కావా లనుకున్న ఆ భావానికి ప్రేమ అనే పేరు పెట్టి అపవిత్రం చేయకు. అలాంటి తోడు నా నుంచి నీకు లభించదు. ఇప్పుడు నువ్వు చూపే అవకాశవాదమైన ఈ ప్రేమ నాకు అసహ్యాన్ని కలిగిస్తుందే తప్ప ఆనందం కలిగించదు. నీకు వచ్చిన ఆ భయంకర వ్యాధికి మనిషిగా సానుభూతి చూపుతున్నాను. అవసరమైతే ఈ చెక్‌మీద రాసిచ్చిన డబ్బు తీసుకుని వాడుకో. ఆ నాడు నీవు నేర్పిన మాటే ... నీ దారి నీవు చూసుకుంటే సంతోషిస్తాను. సాయంత్రం నేను తిరిగి వచ్చేసరికి ఈ గది ఖాళీగా ఉంటే ... అదే నా క్కావలసింది. నే ననుభవించిన క్షోభకు ... నీ కీ శాస్తి సరిపోదు! అయినా ఇంతకంటే ఏం చేయలేను కూడా!

"గుడ్ బై!
ఛాయ"